సాక్షి
పశ్చిమగోదావరి
శుక్రవారం | 28 | ఏప్రిల్ | 2023



కొంతేరులో నాటిక పోటీలు

కొంతేరు పులపర్తి వీరాస్వామి యూత్ క్లబ్ కళామందిరంలో నేటి నుంచి నాటిక పోటీలు జరగనున్నాయి. ఈ నెల 30 వరకు ఈ పోటీలు నిర్వహిస్తారు. 8లో ▸



ప్రభుత్వ బడి.. ప్రజల బాధ్యత

రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో సామాజిక తనిఖీ కార్యక్రమాన్ని చేపట్టింది. దీనిలో భాగంగా అన్ని మండలాల్లో సామాజిక తనిఖీపై శిక్షణ తరగతులు పూర్తిచేశారు. 8లో ▸

పంచాయతీ అధికారిగా మల్లికార్జునరావు



భీమవరం(ప్రకాశంచౌక్): జిల్లా పంచాయతీ అధికారిగా జీవీకే మల్లికార్జునరావు బాధ్యతలు చేపట్టారు. ఏలూరు డ్వామాలో అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా పని చేస్తూ బదిలీపై వచ్చారు.

న్యూస్‌రీల్

ఐటీడీఏ పీఓగా రామశేషు నియామకం



ఐటీడీఏ పీఓగా రానున్న రామశేషు

బుట్టాయగూడెం: కేఆర్‌పురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా కె.రామశేషును నియమిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు విడుదల చేసింది. చింతూరు ఐటీడీఏ పీఓగా పనిచేస్తున్న రామశేషును ఇక్కడికి బదిలీ చేస్తూ 2022 అక్టోబర్ 28న ఉత్తర్వులు జారీ అయ్యాయి. అయితే కొన్ని కారణాల వల్ల రామశేషు పీఓగా చేరలేదు. ఆ తరువాత ఇన్‌చార్జుల పాలన కొనసాగింది. ఈ నెల 26న ఏలూరు కోనేరు రంగారావు సిఫార్సుల కమిటీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జీవీవీ సత్యనారాయణ ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీఓగా బాధ్యతలు చేపట్టారు. అయితే రామశేషు ఐటీడీఏ పీఓగా కొనసాగాలని పాత ఆదేశాలనే ధ్రువీకరిస్తూ ఉత్తర్వులు వచ్చినట్లు ఐటీటీఏ వర్గాలు తెలిపాయి.

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం



విద్యార్థులకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సర్టిఫికెట్ ప్రదానం చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: అన్ని పాఠ్యాంశాలలో ప్రతిభ, నైపుణ్యం కనబర్చినందుకు తమ విద్యార్థులకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం లభించిందని పెదతాడేపల్లి గురుకుల విద్యాలయ ప్రిన్సిపాల్ బి.రాజారావు తెలిపారు. గురువారం మండలంలోని పెదతాడేపల్లి డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ గురుకుల విద్యాలయలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ రాజారావు మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను గుర్తించి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో 150 మందికి స్థానం కల్పించారన్నారు. వేసవి సెలవులను వృథా చేయకుండా ప్రతి విద్యార్థి చదవడం, రాయడంపై పట్టు సాధించాలన్నారు. రోజుకు రెండు గంటల పాటు క్రీడలు, వ్యాయామం చేయాలని సూచించారు. విద్యార్థుల ప్రతిభ ఆధారంగా ఇంటి వద్ద నూతన ఆవిష్కరణల్లో భాగంగా వివిధ ప్రాజెక్టులు చేసేందుకు తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ బి.ప్రతాప్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

తెరుచుకున్న పాలకొల్లు రైల్వే గేటు



పాలకొల్లు రైల్వే గేటును ప్రారంభిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు పట్టణంలోని రైల్వేగేటు పనులు పూర్తయిన సందర్భంగా గురువారం రైల్వే గేటును తెరిచారు. గత మూడు రోజులుగా గేటు మూసివేసి పాలకొల్లు భీమవరం ట్రాఫిక్‌ను బైపాస్ రోడ్డు మీదుగా మళ్లించి ట్రాక్‌వద్ద రోడ్డు పనులు పూర్తి చేశారు. గురువారంతో పనులు ముగియడంతో గేటును తెరిచి ట్రాఫిక్‌ను కొనసాగించారు. అనంతరం డీఆర్‌యుసిసి మెంబర్ జక్కంపూడి కుమార్ రైల్వే కాంట్రాక్టర్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ట్రాక్ పనులు పూర్తిచేయడానికి సహకరించిన స్టేషన్ మాస్టర్ టి.రామలింగేశ్వరరావు, రైల్వే అధికారులు, కాంట్రాక్టర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ విద్యార్థుల సత్తా

సాక్షి, భీమవరం: ఇటీవల వెల్లడించిన ఇంటర్ ఫలితాల్లో జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి కేవీ సత్యనారాయణ తెలిపారు. జిల్లాలో 14 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా ఫస్ట్ ఇయర్ 46.54 శాతం, రెండో ఏడాది 58.13 శాతం, ఒకేషనల్ ప్రథమ సంవత్సరంలో 45.5 శాతం, రెండో సంవత్సరం 55.44 శాతం ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. పాలకొల్లు జూనియర్ కళాశాలకు చెందిన జె.వినీత (ఎంపీసీ, 978 మార్కులు), ఎస్.దీవెన కుమారి (బైపీసీ, 972 మార్కులు), ఆర్.మోహిని దుర్గ (ఎంపీసీ ఫస్ట్ ఇయర్, 443) ఎస్.కుసుమాంజలి (సీఈసీ ఫస్ట్ ఇయర్, 469) మార్కులు సాధించారని తెలిపారు.

ప్రశాంత నిలయాలు.. శ్మశాన వాటికలు



వెలంపేట ఆర్యవైశ్య శ్మశాన వాటిక వద్ద కాటికాపరి విగ్రహం

- ఆహ్లాదకరంగా రుద్రభూములు
- దాతలు, ప్రభుత్వాల సహకారంతో శ్మశానాలకు కొత్త రూపు



రుద్రనేత్రుడి విగ్రహం

ఆకివీడు: శ్మశాన వాటికలు.. ఒకప్పుడు అటు వైపు వెళ్లాలంటే జనం భయపడేవారు. పుర్రెలు, ఎముకలు, చెత్తచెదారంతో అటు వైపు వెళ్లేందుకు జంకేవారు. కొందరైతే బహిర్భూమిగా వాడేవారు. అలాంటి రుద్రభూములు నేడు స్వర్గధామాల్ని తలపిస్తున్నాయి. పల్లెల నుంచి పట్టణాల వరకూ ఆధునిక వసతులతో, అందమైన శ్మశానాల్ని నిర్మిస్తున్నారు.

శవంతో శ్మశానానికి వెళ్లిన వ్యక్తులకు ఆ ప్రాంతాన్ని చూస్తే ఒక రకమైన ఆందోళనకర వాతావరణం కనిపించేది. నేడు శ్మశాన భూములు ప్రశాంత వాతావరణంతో, పచ్చగా, పరిశుభ్రతతో ఉంటున్నాయి. కోటీశ్వరుడైనా, బికారైనా ఆఖరి మజిలీ ఇక్కడే. ప్రతి ఒక్కరికీ మోక్షం ఇక్కడే అని భావించి శ్మశాన వాటికల అభివృద్ధికి జిల్లాలోని పలు గ్రామాల్లోని దాతలు ఇటీవల ముందుకు వస్తున్నారు. జిల్లాలోని 409 గ్రామ పంచాయతీల పరిధిలో రెండు, మూడు శ్మశాన వాటికలున్నాయి. వీటిలో సుమారు 120 నుంచి 150 స్మశాన వాటికల్ని ఇటీవల అభివృద్ధి పరిచారు.

స్వర్గధామంగా రుద్రభూమి

రుద్రభూములు స్వర్గధామాలుగా కన్పిస్తున్నాయి. గ్రామాల్లో దేవాలయాల అభివృద్ధి వలే దాతలు రుద్రభూముల అభివృద్ధికి విరాళాలిస్తున్నారు. లోతట్టులో ఉన్న రుద్రభూములలో ప్రభుత్వ నిధులతో పూడిక పనులు పూర్తి చేశారు. ఎంపీ లాడ్స్, ఉపాధి హామీ నిధులు, ఇతరత్రా నిధులతో రుద్ర భూములు అందంగా కన్పిస్తున్నాయి. రుద్రభూముల అభివృద్ధికి గ్రామాల్లో పెద్ద పీట వేస్తున్నారు. హిందూ, క్రైస్తవ శ్మశాన వాటికల అభివృద్ధితో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. శ్మశాన వాటికల్లో చుట్టూ ప్రహరీ గోడలు నిర్మించి మొక్కలు పెంచుతున్నారు. పంచాయతీ పరిధిలో కుళాయి సౌకర్యం కల్పిస్తున్నారు. గార్డెన్లు పెంచుతున్నారు. సుందరవనాలుగా తీర్చిదిద్దుతున్నారు. శవ దహన కార్యక్రమాలకు వచ్చే బంధుమిత్రులు వేచి ఉండే గది, స్నానాదులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తున్నారు. రుద్రనేత్రుడు, కాటికాపరిల విగ్రహాలు కూడా ఏర్పాటు చేస్తున్నారు. అంతిమ మజిలీకి మోక్ష ధామంగా శ్మశనాలు ఉన్నాయని పలు గ్రామాల్లో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



ఆకివీడులోని వెలంపేట వద్ద దాతల సహకారంతో అభివృద్ధి చేసిన హిందూ శ్మశాన వాటిక

శ్మశానాల్లో అన్ని సౌకర్యాలు



కొల్లేరు తీరంలోని పెద కాపవరంలో నాలుగేళ్ల క్రితమే కుటీరాన్ని తలపిస్తూ శ్మశాన భవనాన్ని నిర్మించారు. శవ దహనాలు చేసిన అనంతరం ఆ ప్రాంతాన్ని శుభ్రపరచడంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం పూర్తయ్యింది. విశ్రాంతి భవనం, స్నానాలకు సౌకర్యం ఉంది.

– కఠారి రామకృష్ణ(రాము),
పెద కాపవరం, ఆకివీడు మండలం

క్రైస్తవ శ్మశానాల్ని అభివృద్ధి చేయాలి



క్రైస్తవ స్మశాన వాటికల్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. దాతల సహకారంతో ఆకివీడులో ప్రహరీ గోడ నిర్మించాం. స్థల పూడికకు ఉపాధి హామీ నిధులు ఇచ్చారు. అన్ని గ్రామాల్లోని క్రైస్తవ స్మశాన భూముల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయించాలి.

– జీ.జోసఫ్‌రాజు,
సీబీసీఎన్‌సీ టౌన్ చర్చి కార్యదర్శి, ఆకివీడు

సబ్ జైళ్లలో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలు

మంత్రి తానేటి వనిత



పోలవరం సబ్ జైలు ప్రాంతంలో పెట్రోల్ బంక్ ప్రారంభం సందర్భంగా శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి తానేటి వనిత

పోలవరం రూరల్: స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాల ద్వారా జైళ్లలోని ఖైదీలకు వారి ఆసక్తిని బట్టి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. పోలవరం సబ్‌జైలు ప్రాంతంలో జైళ్ల శాఖ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన పెట్రోల్ బంక్‌ను గురువారం మంత్రి తానేటి వనిత ఎమ్మెల్యే తెల్లం బాలరాజుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వనిత మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో హెచ్‌పీసీఎల్ సంస్థ జైళ్ల శాఖతో కలిసి పెట్రోల్ బంక్ నిర్వహించడం శుభపరిణామం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ కారణంగా జైళ్లలో పరిశుభ్రత పెరిగిందని, విశాఖపట్నంలోని సెంట్రల్ జైలు దేశంలోనే రెండో పరిశుభ్రమైన జైలుగా గుర్తింపు సాధించిందన్నారు. రాష్ట్రంలోని జైళ్లను సంస్కరణ కేంద్రాలుగా మార్చి, వివిధ నేరాలు చేసి జైళ్లకు వచ్చిన ఖైదీలలో పరివర్తన తేవడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ఎంతో కృషిచేస్తోందన్నారు. ఖైదీలకు ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. జైళ్లల్లో ఉన్న వారికి సత్ప్రవర్తన కలిగించేలా స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు నిర్వహించి వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు.

జైళ్ల శాఖ ఆధ్వర్యంలో 17 పెట్రోలు బంకులు

జైలు శిక్ష అనుభవించి బయటకు వెళ్లే వారిలో మార్పు వచ్చేలా శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని సబ్‌జైళ్లలో ఖైదీల కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. జైళ్ల శాఖ ఆధ్వర్యంలో 17వ పెట్రోల్ బంక్‌ను పోలవరంలో ప్రారంభించామని.. వీటి ద్వారా వచ్చే ఆదాయాన్ని ఖైదీల ఆర్థిక అభివృద్ధికి, సంక్షేమానికి వినియోగిస్తామన్నారు. కార్యక్రమంలో జైళ్ల శాఖ డీజీ ఎండీ అసన్ రాజ్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఎం.వరప్రసాద్, జిల్లా సబ్ జైలు అధికారి సీహెచ్ ఆర్‌వీ స్వామి, ఆర్డీఓ ఎం.ఝాన్సీరాణి, డీఎస్పీ కె.లతాకుమారి, ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, జెడ్పీటీసీ కలుం హేమకుమారి ఎంపీటీసీలు కుంజం చిట్టిమ్మ, యామల శ్రీదేవి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బుగ్గా మురళీకృష్ణ, పోలవరం సర్పంచ్ పాడుం పుష్ప, ఇటికిలకోట సర్పంచ్ సున్నం చంద్రమ్మ, తహసీల్దార్ బి.సుమతి పాల్గొన్నారు.

రూ. 10 కోట్లతో సమీకృత ఆర్థిక భవనం

ఏలూరులో ప్రారంభించిన ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్



ఏలూరులో సమీకృత ఆర్థిక శాఖ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, చిత్రంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి షంషేర్ సింగ్ రావత్, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు(మెట్రో): ఆహ్లాదకర వాతావరణంలో, అనుకూలమైన పని వాతావరణం కల్పిస్తూ సుమారు రూ.10 కోట్లతో సమీకృత ఆర్థిక భవనాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ అన్నారు. ఏలూరులో నిర్మించిన ఈ సమీకృత ఆర్థిక భవనాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ భవనంలోని ఖజానా, ఏపీజీఎల్ఐ, స్టేట్ ఆడిట్, స్టేట్ ఆడిట్ రిలీఫ్ అకౌంట్స్ తదితర ఆర్థిక విభాగాల కార్యాలయాలను పరిశీలించి ఉద్యోగులతో ముచ్చటించారు. అనంతరం మంత్రి బుగ్గన మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నో భవనాలు నిర్మించడమే కాకుండా గత ప్రభుత్వం చేపట్టి అసంపూర్తిగా మిగిల్చిన భవనాలను పూర్తిచేసిందన్నారు. ఏలూరులోని సమీకృత ఆర్థిక శాఖ భవనం అందులో ఒకటని.. సుమారు 26,500 చదరపు అడుగుల విస్తీర్ణంలో దీన్ని ఏర్పాటు చేశామన్నారు.

మరింత మెరుగైన సేవలు

ఏలూరులో గతంలో ఖజానా, ఆడిట్, బీమా ఇలా వివిధ విభాగాలు వేర్వేరు చోట్ల నుంచి పనిచేసేవని ఇప్పుడు అవన్నీ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ఒకే భవనంలో ఏర్పాటయ్యాయన్నారు. దీనివల్ల ఆయా విభాగాలు మరింత బాగా సేవలు అందించేందుకు వీలువుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి షంషేర్ సింగ్ రావత్, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఆర్థిక శాఖ కార్యదర్శి డా. కేవీ సత్యనారాయణ, ట్రెజరీ డైరెక్టర్ కెవీ మోహన్ రావు, డైరెక్టర్ ఆఫ్ వర్క్ అకౌంట్స్ సీహెచ్ కె. మల్లేశ్వరరావు, ఏపీపీఎఫ్ఎస్ఎస్ సీఈఓ బి.సునీల్ కుమార్ రెడ్డి, ఏపీజీఎల్ఐ డైరెక్టర్ రెడ్డి శ్రీనివాస రావు, స్టేట్ ఆడిట్ డైరెక్టర్ హరిప్రకాష్, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఎండీ సి.దీవన్ రెడ్డి, ఆర్డీఓ కె.పెంచల కిషోర్, ఖజానా అధికారి టి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు. అంతకముందు గురువారం ఏలూరు విచ్చేసిన రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌కు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ స్వాగతం పలికారు.

రైతుల్ని ఇబ్బంది పెడితే చర్యలు తప్పవు



అజ్జమూరు ధాన్యం వేబ్రిడ్జి వద్ద సర్వర్ల లోపాన్ని సరిచేయిస్తున్న భీమవరం ఆర్డీఓ దాసి రాజు

ఆకివీడు: రైతుల్ని ఇబ్బంది పెట్టేలా మిల్లర్లు వ్యవహరిస్తే చర్యలు తప్పవని భీమవరం ఆర్డీఓ దాసి రాజు హెచ్చరించారు. మండలంలోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాల్ని, రైస్ మిల్లులను ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు ఆర్డీఓతో మాట్లాడుతూ కాటాలు తేడా ఉంటున్నాయని, తేమ శాతం అధికంగా ఉంటుందని, నూక శాతం ఎక్కువ వస్తుందని మిల్లర్లు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయనకు ఫిర్యాదు చేశారు. మిల్లుల వద్దకు చేరిన ధాన్యాన్ని తిప్పి పంపుతున్నారని వారు వాపోయారు. అజ్జమూరు గొడౌన్ వద్ద సర్వర్లు, వేబ్రిడ్జిని ఆర్డీఓ తనిఖీ చేశారు. అయిభీమవరం రోడ్డులోని రైస్‌మిల్లులో ధాన్యం దిగుమతులపై ఆరా తీశారు. రైతుల్ని ఇబ్బందులకు గురి చేయవద్దని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావుతో మాట్లాడుతూ రైతుల్ని ఇబ్బందులకు గురి చేసే మిల్లులపై లిఖిత పూర్వకంగా కలెక్టర్‌కు, తనకు తెలియజేయాలని ఆదేశించారు. తదుపరి చర్యలుంటాయని చెప్పారు. కస్టోడియన్ అధికారులు మిల్లర్లతో సంప్రదింపులు జరిపి ధాన్యం దిగుమతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ మాట్లాడుతూ అజ్జమూరు గొడౌన్ వద్ద కాటా సక్రమంగా ఉందని ఆర్డీఓకు తెలిపారు. ఇక్కడ కాటా వేసిన ధాన్యం మిల్లుల వద్దకు చేరేసరికి తూకంలో తేడా వస్తుందని మిల్లర్లు చెబుతున్నారని ఆర్డీఓ దృష్టికి ఆయన తీసుకువెళ్లారు. కాటా తేడా ఉంటే మధ్యవర్తి కాటాను ఏర్పాటు చేశామని, మిల్లర్లు వాటిని ఉపయోగించుకోవచ్చునని ఆర్డీఓ తెలిపారు. ఆర్డీఓ వెంట ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీకర్, ఏడీఏ శ్రీనివాసరావు, ఏఓ ప్రియాంక, వీఆర్వోలు పాల్గొన్నారు.

మాసూళ్లలో జాగ్రత్తలు అవసరం

సాక్షి, భీమవరం: దాళ్వా మాసూళ్లలో రైతులు మెరుగైన పద్ధతులు పాటించకపోతే మిల్లింగ్ సమయంలో నూక శాతం పెరిగే ప్రమాదముందని జిల్లా వ్యవసాయశాఖాధికారి జెడ్.వెంకటేశ్వరరావు గురువారం చెప్పారు. ప్రస్తుత దాళ్వా సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా రైతులు ఎక్కువగా ఎంటీయూ 1121, 1153, 1156, 3626, పీఆర్ 126 వంటి వరి రకాలను సాగుచేశారన్నారు. ప్రస్తుతం మాసూళ్లు ముమ్మరంగా సాగుతున్న తరుణంలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నందున మెరుగైన పద్ధతులు పాటించాలని సూచించారు. పంట కోత కోసే ముందు భూమిలో తేమ ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. భూమిలో చెమ్మలేక బీటలు వారిని తరువాత కోత కోస్తే బియ్యంలో నూకల శాతం అధికంగా ఉంటుందన్నారు. వరి కంకుల్లో 90 శాతం గింజలు పసుపు రంగుకు మారుతున్నప్పుడే పంటను కోత కోయాలని వెంకటేశ్వరరావు చెప్పారు. పంటను కర్రపచ్చిమీద వరికోత యంత్రాలతో కోత కోసిన రెండు-మూడు రోజులు ఆరబెట్టుకుని సంచుల్లో నింపాలన్నారు. ఆలస్యంగా కోతకోయడం అధిక ఉష్ణోగ్రతలో ఆరబెట్టడం వల్ల మిల్లింగ్‌లో నూక శాతం పెరిగే ప్రమాదముందని చెప్పారు.

వైఎస్ జగన్‌ను మరోసారి సీఎంను చేద్దాం



తిమ్మయ్యపాలెం చెరువులో ఉపాధి పనులు పరిశీలిస్తున్న ప్రభుత్వ సలహాదారు పి.నాగార్జున రెడ్డి

ఉంగుటూరు: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అమలుచేస్తున్న పథకాలు గతంలో ఏ ముఖ్యమంత్రి చేయలేదని.. 2024లో జగన్‌ని సీఎం చేయడానికి అందరూ కలిసి పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు(పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంటు) పోతిరెడ్డి నాగార్జున రెడ్డి అన్నారు. గురువారం ఆయన జిల్లా, మండల అధికారులతో కలిసి ఉంగుటూరు మండలంలోని తిమ్మయ్యపాలెం, నల్లమాడు, యర్రమల్లిపాడు, చేబ్రోలులో పర్యటించారు. క్షేత్ర స్థాయిలో పథకాల అమలు తీరుపై ఆరా తీశారు. పలు సూచనలు చేశారు. తిమ్మయ్యపాలెం చెరువు, నల్లమాడు గవళ్లగుంటలో జరుగుతున్న ఉపాధి హామీ పనులు పరిశీలించారు. ఇన్ని పథకాలు అమలు చేస్తున్న జగన్ పేదల పక్షాన ఉన్నారని, 2024 ఎన్నికల్లో జగన్‌ని సీఎంగా నెగ్గించుకుందామని అన్నారు. నల్లమాడు గవళ్ల చెరువులో కూడా ఉపాధికూలీలతో మాట్లాడారు. నల్లమాడు సర్పంచి గౌతు రాము, వైఎస్సార్‌సీపీ నేత సుంకవల్లి రవి పాల్గొన్నారు. యర్రమల్లిపాడు, చేబ్రోలులో సచివాలయ ఉద్యోగులతో సమావేశమయ్యారు. యర్రమిల్లిపాడు సర్పంచి తిమ్మిన శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నేతలు నాగు, దాసరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీ విచారణకు సబ్ రిజిస్ట్రార్ ఉద్యోగులు

పరారీలో కొందరు లేఖర్లు

నరసాపురం: నరసాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై బుధవారం ఏసీబీ అధికారులు జరిపిన దాడులు కార్యాలయ ఉద్యోగులు, సిబ్బందిలో గుబులు రేపుతున్నాయి. గురువారం తెల్లవారుజామున 3 గంటల వరకూ ఏసీబీ డీఎస్పీ ప్రసాద్, నలుగురు సీఐలు సోదాలు నిర్వహించారు. సబ్ రిజిస్ట్రార్ వీరభద్రరావు వద్ద అనధికారికంగా రూ.50 వేలు గుర్తించిన విషయం తెలిసిందే. కార్యాలయంలో అక్రమ రిజిస్ట్రేషన్‌లతో ఏడాది కాలంలో లంచాల రూపంలో రూ. కోట్లు చేతులు మారినట్లు సమాచారం. దీంతో గురువారం తెల్లవారుజామువరకూ సోదాలు చేసిన ఏసీబీ అధికారులు ఉదయం సబ్‌రిజిస్ట్రార్‌తో సహా కార్యాలయ ఉద్యోగులు, ప్రైవేట్ ఉద్యోగుల్ని ఏలూరు అవినీతి నిరోధకశాఖ కార్యాలయానికి విచారణ నిమిత్తం పిలిచారు. ఏడాది కాలంగా జరిగిన రిజిస్ట్రేషన్ల వివరాలు, మరికొన్ని పత్రాలు తీసుకురావాలని ఆదేశించారు. దీంతో సంబంధిత వివరాలతో విచారణకు హాజరయ్యారు. గురువారం సాయంత్రం వరకూ వారిని ఏలూరులో విచారించారు.

సిబ్బందిలో గుబులు : ఏసీబీ అధికారులు అక్రమ రిజిస్ట్రేషన్లపై దృష్టి పెట్టి లోతైన దర్యాప్తునకు ఉపక్రమించడంతో కార్యాలయ ఉద్యోగులు, సిబ్బందిలో గుబులు పట్టుకుంది. ముఖ్యంగా నరసాపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం కేంద్రంగా కొంతకాలంగా అక్రమ రిజిస్ట్రేషన్‌లు జోరుగా సాగడం, నిబంధనలకు తిలోదకాలు ఇచ్చి లక్షల్లో ముడుపులు తీసుకుని వ్యవహారాలు నడపడంపై ఫిర్యాదులు అధికమయ్యాయి. కొందరు దస్తావేజుల లేఖర్లు ఈ వ్యవహారంలో కీలకంగా వ్యవహరిస్తున్నట్టు సమాచారం. ఏసీబీ సదరు లేఖర్లపై దృష్టిపెట్టడంతో భయపడుతున్నారు. ముఖ్యంగా చనిపోయిన వారి పేర్లతో పాత తేదీలు వేసి వీలునామాలు రిజిస్ట్రేషన్‌లు చేయించడం లాంటి ఆరోపణలు లేఖర్లు ఎదుర్కొంటున్నారు. కొద్దిరోజుల క్రితం చనిపోయిన మహిళకు సంబంధించి తనఖా అగ్రిమెంట్‌ను, ఫ్యామిలీ సర్టిఫికెట్ లేకుండా ఓ లేఖరి సబ్ రిజిస్ట్రార్‌తో వ్యవహారం నడిపి లక్షల్లో సొమ్ము తీసుకుని క్యాన్సిల్ చేయించినట్టు సమాచారం.

భగీరథుడిని స్ఫూర్తిగా తీసుకోవాలి



భగీరథ మహర్షి జయంతి కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం(ప్రకాశంచౌక్): లక్ష్యం నిర్దేశించుకుని దాన్ని సాధించడం కోసం ప్రయత్నించడం ద్వారా మంచి సమాజం ఏర్పడుతుందని కలెక్టరు పి.ప్రశాంతి అన్నారు. గురువారం శ్రీ భగీరథ మహర్షి జయంతి మహోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టరు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ గంగాజలాలను దివి నుంచి భువికి తీసుకొచ్చిన ఘనత భగీరథుడికి దక్కుతుందని కలెక్టరు అన్నారు. భగీరథుడు మహాజ్ఞాని, పరోపకారానికి పెట్టింది పేరని, ఎవరైనా కఠోర శ్రమ చేసి దేన్నైనా సాధిస్తే దానిని భగీరథ ప్రయత్నం అంటారని కలెక్టరు పేర్కొన్నారు. కష్టసాధ్యమైన పనిని సాధించాలంటే భగీరథుడిని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. మనకంటే ముందున్న వారితో పోటీపడి విజయం సాధించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం భగీరథుడు జయంతిని అధికారికంగా ప్రకటించిందని కలెక్టరు పి.ప్రశాంతి తెలిపారు. డీఆర్వో కె.కృష్ణవేణి మాట్లాడుతూ అనుకున్న లక్ష్యాలు చేరుకునేలా ఎంత కష్టమైన వదలకుండా ప్రయత్నించాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ దాసి రాజు, వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి జి.గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

రైలులో మర్చిపోయిన ఫోన్ అప్పగింత


సెల్‌ఫోన్‌ను అప్పగిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం : రైలులో ప్రయాణిస్తూ ఫోన్‌ను సీటులోనే వదిలి గమ్యస్థానంలో దిగిన ఓ ప్రయాణికుడికి ఆర్‌పీఎఫ్ సిబ్బంది ఫోన్‌ను తిరిగి అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. ఉప్పన వెంకటనిరంజన్ శర్మ అనే ప్రయాణికుడు చెన్నై నుంచి విజయవాడకు 22808 సూపర్ ఫాస్టు ఎక్స్‌ప్రెస్‌లో బీ6 బోగీలో సీటు నంబరు 52లో ప్రయాణం చేసి గమ్యస్థానం వచ్చిందని హడావిడిగా ఫోన్‌ను సీటులో వదిలేసి దిగిపోయారు. అనంతరం ఫోన్ మర్చిపోయిన విషయాన్ని గుర్తించి ఈ విషయాన్ని తాడేపల్లిగూడెంలోని తన బంధువు సమాచారశాఖ మాజీ ఉద్యోగి నాగేశ్వరరావుకు తెలియజేశారు. ఆయన వెంటనే 139 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించారు. రైల్వే ప్రొటెక్షన్ పోలీసులు స్పందించడంతో ఆ ఫోన్ దొరికింది. తాడేపల్లిగూడెం ఆర్‌పీఎఫ్ ఉద్యోగి జి.రవి ఫోన్‌ను నాగేశ్వరరావుకు అందజేశారు. రైల్వే ప్రయాణికులు ఆలిండియా హెల్ప్‌లైన్ 139 టోల్‌ఫ్రీ నంబర్‌ను అత్యవసర సమయంలో వినియోగించడం ద్వారా ప్రయాణికుల సమస్యలు తీరుతున్నాయని రవి ప్రశంసించారు.

ప్రభుత్వ బడి.. ఇక ప్రజల బాధ్యత

- సర్కారు పాఠశాలల్లోనూ సామాజిక తనిఖీ అమలు
- పాఠశాల అభివృద్ధిలో అందరి భాగస్వామ్యమే లక్ష్యం
- సమగ్ర నివేదిక తయారీలో హెచ్‌ఎంలు నిమగ్నం


సోషల్ ఆడిట్‌కు హాజరైన ఉపాధ్యాయులు

నూజివీడు: రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి అనేక విప్లవాత్మకమైన చర్యలను చేపట్టారు. నాడు–నేడు ఒకటో విడత, రెండో విడతల్లో పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను పూర్తి స్థాయిలో కల్పించడంతో పాటు నూతన భవనాలను సైతం నిర్మిస్తున్నారు. అలాగే జగనన్న విద్యా కానుక కిట్ల పేరుతో విద్యార్థులకు యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, షూలు, సాక్స్, బ్యాగ్‌లు, బెల్టులు తదితర వాటిని అందజేస్తున్నారు. మధ్యాహ్న భోజనం పథకంలో జగనన్న గోరుముద్ద పేరుతో మరింత పోషకాహారాన్ని ప్రభుత్వం విద్యార్థులకు అందజేస్తోంది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో సోషల్ ఆడిట్ (సామాజిక తనిఖీ) కార్యక్రమాన్ని చేపట్టింది. దీనిలో భాగంగా జిల్లాలోని అన్ని మండలాల్లో సామాజిక తనిఖీపై ఒక రోజు శిక్షణ తరగతులను పూర్తిచేశారు. ఈనెల 29 నాటికి పాఠశాల స్థాయిలో సమగ్ర నివేదికను తయారు చేసేందుకు హెచ్‌ఎంలు నిగ్నమయ్యారు.

పాఠశాలల్లో సామాజిక తనిఖీ ముఖ్యోద్దేశం

పాఠశాలల అభివృద్ధిలో ప్రజల, తల్లిదండ్రుల, తల్లిదండ్రుల కమిటీ సభ్యుల, ఉపాధ్యాయుల భాగస్వామ్యాన్ని పెంచడమే సామాజిక తనిఖీ ముఖ్యోద్దేశం. సామాజిక తనిఖీలో భాగంగా పాఠశాలకు చెందిన భౌతిక, మౌలిక వసతులు, నిధుల విడుదల, ఖర్చుల వివరాలు, ఉపాధ్యాయులు పనితీరు, విద్యార్థుల హాజరు, ప్రగతి, మధ్యాహ్న భోజనం, ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు, లింగ వివక్షత, పాఠశాల భద్రత తదితర అంశాలపై తనిఖీ చేస్తారు. బడిబయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించడం, బాలికా విద్యను ప్రోత్సహించడం, బాలికలకు భద్రత కల్పించడం చేస్తారు. అంతేగాకుండా సమగ్ర శిక్ష ద్వారా పాఠశాలకు ప్రతిఏటా మంజూరైన నిధులు, వాటి వినియోగానికి సంబంధించిన వివరాలను గోడపై విద్యా సంవత్సరాల వారీగా ప్రదర్శించాలి.

బడి బలోపేతానికి నిధులు

పాఠశాలల్లో ఇప్పటివరకు చేపట్టిన కార్యకలాపాలను పరిశీలించడంతో పాటు భవిష్యత్‌లో ఏ మేరకు పనులు చేపట్టాలనేది పేరెంట్స్ కమిటీల భాగస్వామ్యంతో సమగ్ర ప్రణాళికను తయారు చేస్తారు. ఇందుకోసం పాఠశాల స్థాయిలో యూ డైస్ కోడ్ ఆధారంగా ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా చేపట్టనున్న కార్యక్రమాలకు ఏ మేరకు నిధులు అవసరమనేది సమగ్ర నివేదిక రూపొందిస్తారు. దీని ప్రకారమే ఆయా పాఠశాలలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయిస్తాయి.

చాలా మంచి కార్యక్రమం



పాఠశాలల సోషల్ ఆడిట్ అనేది మంచి కార్యక్రమం. దీని వల్ల పాఠశాల అభివృద్ధిలో తల్లిదండ్రుల భాగస్వామ్యం పెరగడంతో పాటు పనిచేసే ఉపాధ్యాయ సిబ్బందిలో జవాబుదారీ తనం సైతం పెరుగుతుంది. పాఠశాలల అభివృద్ధి ప్రణాళిక తయారీలో కూడా తల్లిదండ్రుల పాత్రను కూడా ఉంచడం వల్ల వాస్తవ విషయాలు వారికి కూడా తెలుస్తాయి. ప్రతి విషయం పారదర్శకంగా ఉంటుంది.

– వీవీఎస్ఆర్ ప్రసాద్, స్టేట్ రిసోర్స్ పర్సన్

నిల్వ బిర్యానీ తిని 13 మందికి అస్వస్థత


బాధితులను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

దెందులూరు: శింగవరంలో నిల్వ బిర్యానీ తిని 13 మంది అస్వస్థతకు గురయ్యారు. గుండుగొలనులో బుధవారం రాత్రి జరిగిన ఓ శుభకార్యంలో మిగిలిన మటన్ బిర్యానీని శింగవరం గ్రామానికి చెందిన కొంతమంది గురువారం తెచ్చుకుని తిన్నారు. కొద్దిసేపటికి అస్వస్థతకు గురి కాగా, వెంటనే 108 వాహనంలో ఏలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వీరిలో బండి లాస్య, బండి అంజి, రావూరి దివ్య, కత్తి భాను, దుర్గాభవాని, హరిప్రసాద్, ఇళ్ల సుబ్రహ్మణ్యం, రావూరి కుమారి, అంకమ్మ, పెద్దివెట్టి దుర్గాభవాని, కత్తి నాగరాజు, బండి చెంచయ్య, కన్నమ్మలు ఉన్నారు. దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆదేశాలతో పార్టీ నాయకులు జానంపేట బాబు, కామిరెడ్డి నాని, సర్పంచ్ పరసా లక్ష్మిసుజాత ఏలూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. ఆర్డీఓ పెంచల కిషోర్, తహసీల్దార్ నాంచారయ్య, ఎంపీడీఓ ఏబీపీవీ లక్ష్మి ఆస్పత్రికి వెళ్లి పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు కామిరెడ్డి నాని ఆర్థికసాయం అందించారు.

నేటి నుంచి కొంతేరులో నాటిక పోటీలు


కొంతేరులో నాటికల పోటీలకు సిద్ధమైన కళా వేదిక

యలమంచిలి: కొంతేరు పులపర్తి వీరాస్వామి యూత్ క్లబ్ కళామందిరంలో 41వ జాతీయ స్థాయి నాటిక పోటీల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. యూత్ క్లబ్ నాటక పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 28 నుంచి 30 వరకు మూడు రోజులపాటు నాటిక పోటీలు నిర్వహిస్తున్నట్లు క్లబ్ చైర్మన్ అంబటి మురళీకృష్ణ, పాలకవర్గ సభ్యులు తెలిపారు. తొలిరోజు శుక్రవారం మొదటి నాటికగా గంగోత్రి, పెదకాకాని ఆధ్వర్యంలో పేగురాసిన శాసనం, రెండో నాటికగా శ్రీసాయి కార్తీక క్రియేషన్స్, కాకినాడ వారిచే ఎడారిలో వాన చినుకు, రెండో రోజు శనివారం మొదటి నాటికగా శ్రీ హర్ష క్రియేషన్స్, విజయవాడ వారిచే స్వర్ణకమలాలు, రెండో నాటికగా శ్రీఅమృత లహరి థియేటర్ ఆర్ట్స్, గుంటూరు వారిచే «నాన్నా నేనొచ్చేస్తా», మూడో నాటికగా కళాంజలి, హైదరాబాద్ వారిచే «రైతే రాజు», మూడో రోజు మొదటి నాటికగా శ్రీసాయి ఆర్ట్స్, కొలకలూరు వారిచే «ప్రేమతో నాన్న», రెండో నాటికగా తెలుగు కళాసమితి, విశాఖపట్నం వారిచే «నిశ్శబ్దమా నీ ఖరీదెంత» నాటికలు ప్రదర్శిస్తామని వారు తెలిపారు.

ప్రతి నాటికకు పారితోషికం

ఈ పోటీలలో ప్రదర్శితమైన ప్రతి నాటికకు రూ.15,116 పారితోషకం, షీల్డు ఇవ్వనున్నారు. అలాగే ఉత్తమ ప్రదర్శనకు రూ.15,116 నగదు శాశ్వత షీల్డు, ద్వితీయ ఉత్తమ ప్రదర్శనకు రూ.14,116 నగదు శాశ్వత షీల్డు, తృతీయ ఉత్తమ ప్రదర్శనకు రూ.13,116 నగదు శాశ్వత షీల్డు అందించనున్నారు.




తాడేపల్లిగూడెం రూరల్ : ఆరుగొలను గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తణుకు టౌన్ : తణుకు 15వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

ప్రజల్లో చైతన్యానికి నాటక రంగం దోహదం


నాటిక పోటీల ప్రారంభ కార్యక్రమంలో సినీ సంగీత దర్శకుడు కోటిని సన్మానిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: సమాజంలో దురాచారాలను రూపుమాపడానికి నాటకరంగం ఎంతగానో దోహదం చేస్తుందని రాష్ట్ర మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ అన్నారు. భీమవరం డీఎన్నార్ కళాశాల ఆవరణలోని గన్నాబత్తుల క్రీడా మైదానంలో గురువారం రాత్రి చైతన్య భారతి సంగీత, నృత్య, నాటక పరిషత్ 16వ జాతీయ స్థాయి సాంఘిక నాటికల పోటీలు ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమాజంలో మార్పునకు ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి నాటక రంగం ఎంతగానో కృషి చేసిందన్నారు. సమాజంలో మార్పులకు కన్యాశుల్కం వంటి నాటకలే నిదర్శమన్నారు. సినీనటుడు శుభలేక సుధాకర్ మాట్లాడుతూ నాటకరంగమే సినీ, టీవీ రంగాలకు మార్గదర్శకమని, నాటకాలను బతికించుకోవాలన్నారు. తాను ప్రస్తుతం సినీరంగానికి కొంతదూరంగా టీవీ రంగానికి దగ్గరగా ఉన్నానన్నారు. సినీ సంగీత దర్శకుడు సాలూరి కోటేశ్వరరావు (కోటి) మాట్లాడుతూ విలువలతోపాటు సంస్కృతి సంప్రదాయాలను నేర్చుకునే అవకాశం ఉన్నందున నాటక రంగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. సినీ సంగీత దర్శకులు సాలూరి కోటేశ్వరరావుకు ఆత్మీయ చైతన్య పురస్కారం, ప్రగతి కళామండలి నాటక ప్రయోక్త నూతలపాటి సాంబయ్యకు జవ్వాది రంగస్థల చైతన్య పురస్కారం, రంగస్థల, టీవీ, సినీనటి కె.విజయలక్ష్మిని పెనుపోతుల శేషగిరిరావు హార్దిక చైతన్య పురస్కారంతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఉషోదయ కళానికేతన్ వారి «ప్రక్షాళన» నాటిక ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. కార్యక్రమంలో చైతన్య భారతి నాటక పరిషత్ అధ్యక్షుడు రాయప్రోలు భగవాన్, డీఎన్నార్ కళాశాల అధ్యక్షుడు గోకరాజు వెంకట నర్సింహరాజు, చైతన్య భారతి కార్యదర్శి మంతెన రామ్‌కుమార్‌రాజు, రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, యిర్రింకి సూర్యారావు, బొమ్మిడి నారాయణరావు, బుద్ధాల వెంకటరామారావు, రాయప్రోలు శ్రీనివాసమూర్తి, భట్టిప్రోలు శ్రీనివాస్, వడుపు గోపి, పెన్నాడ శ్రీను, కాగిత వెంకట రమణ, బొండా రాంబాబు, పేరిచర్ల లక్ష్మణ వర్మ, మానాపురం సత్యనారాయణ పాల్గొన్నారు.

యువకుని అదృశ్యంపై కేసు నమోదు

ముసునూరు: యువకుని అదృశ్యంపై ముసునూరు పోలీస్‌స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. ఎస్సై ఎం.కుటుంబరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అక్కిరెడ్డిగూడెంకు చెందిన సరస్వతి ప్రవీణ్ కుమార్ అదే గ్రామంలోని ఓ సీడ్ కంపెనీ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ కమ్ క్యాషియర్‌గా పనిచేస్తున్నాడు. కాగా ఇతనితోపాటు అదే కార్యాలయంలో గోపవరానికి చెందిన ఉదయ్, ఇదే గ్రామానికి చెందిన బర్మా సాయి ఫీల్డ్ స్టాఫ్‌గా పనిచేస్తున్నారు. ఉదయ్, బర్మాసాయి దొంగ బిల్లులిచ్చి మోసం చేశారు. దీనిని ప్రవీణ్‌కుమార్‌పై నెట్టేందుకు ప్రయత్నించారు. ఈ నేపథ్యంలో ఈ నెల మూడో తేదీ రాత్రి ప్రవీణ్ ఇంటి వచ్చి పని ఉంది బయటకు రావాలని చెప్పి ఉదయ్, బర్మాసాయి అతనిని తీసుకువెళ్లారు. అప్పటి నుంచి ప్రవీణ్ ఇంటికి తిరిగి రాలేదని తండ్రి సుబ్బరాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాలిక కిడ్నాప్ కేసులో యువకుడి అరెస్ట్

జంగారెడ్డిగూడెం: బాలికను కిడ్నాప్ కేసులో ఓ యువకుడిని అరెస్టు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు చెప్పారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తాడువాయి గ్రామానికి చెందిన ఓ బాలిక ఈ నెల 25 పరీక్ష రాసేందుకు పాఠశాలకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. వారం క్రితం ఈ బాలికను శ్రీనివాసపురానికి చెందిన పి.ఆనందబాబు అలియాస్ ఆనంద్ కిడ్నాప్ చేసి తీసుకుపోగా, గ్రామ పెద్దల సమక్షంలో యువకుడిని హెచ్చరించి బాలికను ఇంటికి తీసుకువెళ్లారు. ఇప్పుడు మరోసారి బాలిక అదృశ్యం కావడంతో ఆనంద్‌పై అనుమానం వ్యక్తం చేస్తూ బాలిక తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా నిందితుడు ఆనంద్‌ను గురువారం అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

డీఎన్ రావు పేటలో చోరీ

చింతలపూడి: డీఎన్‌రావుపేటలోని ఓ ఇంట్లో గురువారం తెల్లవారుజామున జరిగిన చోరీ ఘటనలో 16 కాసుల బంగారం, రూ.3వేల నగదు అపహరణకు గురయ్యాయి. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన అడపా సత్యంబాబు కుటుంబసభ్యులతో కలిసి ఇంటి బయట నిద్రించారు. తలుపు గడియ వేయకుండా పడుకోవడంతో ఇంట్లోకి చొరబడ్డ దొంగలు బీరువాలో ఉన్న 16 కాసుల బంగారు నగలు, రూ.3 వేల నగదు చోరీ చేశారు. ఉదయం నిద్ర లేచి ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉండటం అందులో ఉండాల్సిన బంగారం, నగదు కనిపించకపోవడంతో చోరీకి గురైనట్లు గుర్తించి బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి క్లూస్ టీమ్ సహాయంతో ఆధారాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉచిత న్యాయ సేవలను వినియోగించుకోవాలి


మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి జి.రాజేశ్వరి

ఏలూరు (టూటౌన్): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అందించే ఉచిత న్యాయ సేవలను అవసరమైన మహిళలు వినియోగించుకోవాలని సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి కోరారు. స్థానిక టైటస్ నగర్‌లో గురువారం మహిళలకు నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. మహిళలు తమ గల హక్కులు, చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. మే 13న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో అన్ని రకాల సివిల్, కుటుంబ తగాదాలు, వాహన ప్రమాద, రెవెన్యూ కేసులు, రాజీయోగ్యమైన అన్ని క్రిమినల్ కేసులను రాజీ చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు ఉపయోగించుకోవాలని సూచించారు. ప్రజాసమస్యల శాశ్వత న్యాయ పీఠం చైర్మన్ ఏ.మేరీ గ్రేస్ కుమారి మాట్లాడుతూ ఈ శాశ్వత లోక్ అదాలత్‌లో ప్రయాణ, టెలిఫోన్, బ్యాంకు, ఆసుపత్రుల, విద్యా సేవలు, ఉపాధి హామీ పనులు, రియల్ ఎస్టేట్ తదితర సేవలపై ఏమైనా సమస్యలు ఉంటే శాశ్వత న్యాయ పీఠాన్ని సంప్రదించాలని కోరారు. న్యాయవాది కూన కృష్ణారావు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ జిల్లా సభ్యులు మేతర అజయ్‌బాబు, మెప్మా సీఈఓ రాజేశ్వరి పాల్గొన్నారు.

ఉపాధి కూలీ మృతి

ఏలూరు రూరల్: ఉపాధి హామీ పథకంలో భాగంగా పనులు చేస్తున్న ఓ కూలీ మృతి చెందాడు. ఏలూరు మండలం జాలిపూడి గ్రామానికి చెందిన లంకపల్లి రాజారావు (55) గ్రామంలో ఉపాధి పనికి గురువారం వెళ్లాడు. పనిచేస్తున్న ప్రదేశంలో గుండె నొప్పితో బాధపడుతూ అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే స్థానికులు అతనిని ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.


చాకచక్యంగా భవంతిలోకి ప్రవేశిస్తూ..


ఉగ్రవాదిని పట్టుకుంటూ..

ఆక్టోపస్ మాక్‌డ్రిల్

జిల్లాలోని ప్రధాన కార్యాలయాలను తీవ్రవాదులు టార్గెట్ చేసి విధ్వంసానికి ప్రయత్నిస్తే పదాతి దళాలు ఏ విధంగా ఎదుర్కొంటాయో రాష్ట్ర ఆక్టోపస్ టీమ్ కళ్లకు కట్టినట్లు చూపింది. ఏలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం రాత్రి రాష్ట్ర ఆక్టోపస్ విభాగం ఎస్పీ నాగేంద్రరావు ఆధ్వర్యంలో 45 మంది టీమ్ ఈ మాక్ డ్రిల్ నిర్వహించింది. అలాగే తీవ్రవాదులు వీఐపీలను కిడ్నాప్ చేసి బాంబులను అమర్చిన సందర్భంలో బృందాలుగా విడిపోయి భవంతిని చుట్టుముట్టి లోపలికి వెళ్లి వారిని ఎలా రక్షిస్తారో మాక్ డ్రిల్ ద్వారా చూపించారు. జేసీ లావణ్యవేణి, డీఆర్వో ఏవీఎస్ఎస్ మూర్తి, తిలకించారు. ఆక్టోపస్ అదనపు ఎస్పీ నగేష్‌బాబు, డీఎస్పీ కృష్ణారావు పాల్గొన్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఏలూరు

క్లుప్తంగా

ప్రభుత్వ కళాశాల విద్యార్థుల ప్రతిభ


వై.నాగదుర్గ (బైపీసీ)


టి.సంధ్యారాణి (ఎంఎల్‌టీ)

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఇంటర్మీడియేట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. ప్రిన్సిపాల్ ఆర్.కిషోర్ మాట్లాడుతూ ఐదు గ్రూపుల్లో కలిపి ద్వితీయ సంవత్సరం 67 శాతం, ప్రథమ సంవత్సరం 54 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో కళాశాల స్థాయిలో బైపీసీ విద్యార్థిని వై.నాగదుర్గ 1000కి 959 మార్కులతో ప్రథమ స్థానం, కె.చిన్నిరాజా 911 మార్కులతో ద్వితీయ స్థానం సాధించారని పేర్కొన్నారు. ప్రథమ సంవత్సర ఫలితాల్లో 500కి 473 మార్కులతో ఎంఎల్‌టీ విద్యార్థిని టి.సంధ్యారాణి ప్రథమ, 467 మార్కులతో ఎండీ రుఖీయా రెండో స్థానం సాధించారని తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందనలు వెల్లడించారు.

డయల్ యువర్ డీఎంకు విశేష స్పందన

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ తాడేపల్లిగూడెం డిపోలో గురువారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఫోన్‌లో ప్రయాణికులు అడిగిన ప్రశ్నలకు డీఎం యేలూరి సత్యనారాయణ మూర్తి సమాధానం చెప్పారు. పెంటపాడు సెంటర్‌లో కాకుండా బస్సు స్టాప్‌లో బస్సులు ఆగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరగా ఆర్టీసీ సూపర్‌వైజర్‌ను అక్కడకు పంపి బస్సులు స్టాప్‌లో ఆపే విధంగా చర్యలు తీసుకొన్నారు. స్టాల్స్ అద్దెకు కావాల్సిన వారు టెండర్ల ప్రక్రియలో పాల్గొనాలని కోరారు. పోలవరం బస్సు టైమింగ్స్ మార్చమని కోరగా పరిశీలిస్తామని చెప్పారు. పోలవరం నుంచి రామసింగవరం మీదుగా ద్వారకాతిరుమలకు బస్సు సౌకర్యం పునర్ధరణ కోరగా డిపో మేనేజర్ పరిశీలిస్తామని చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక హసింగ్‌బోర్డు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఫీడర్ మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. గణేష్ నగర్, వీకర్స్‌కాలనీ, గాంధీ బొమ్మ సెంటర్, ఏరియా ఆసుపత్రి పరిసర ప్రాంతాలు, సత్యవతినగర్ చెట్లు రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

పెంటపాడులో..

పెంటపాడు: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పలు గ్రామాల్లో విద్యుత్ కోత ఉంటుందని విద్యుత్ శాఖ డీఈ ఎస్ వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. పెంటపాడు, ముదునూరు తదితర గ్రామాల్లో ప్రజలు సహకరించాలని కోరారు.

భగీరథుని సేవలు విశిష్టమైనవి

పెంటపాడు: సగర్ల మూలపురుషుడు భగీరథ మహర్షి సేవలు విశిష్టమైనవని విజయవాడ కనకదుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు పేర్కొన్నారు. సగర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కర్నాటి కన్నయ్య ఆధ్వర్యంలో పెంటపాడు మండలం పడమర విప్పర్రు గ్రామంలో గురువారం రాత్రి భగీరథుని జయంతి వేడుక ఘనంగా నిర్వహించారు. భగీరథుని చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ భగీరథుని జయంతి కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వం అధికారిక కార్యక్రమంగా నిర్వహించాలని ప్రకటించడం గర్వకారణమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో సగర్లు మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతరావు కృష్ణారావు, గ్రామ సర్పంచ్ తెంటు జయలక్ష్మి, గోపి, నంగిరెడ్డి రామకృష్ణ, సగర్ల సంఘ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సమ్మర్ అలవెన్స్‌లు కొనసాగించాలి

తాడేపల్లిగూడెం రూరల్: ఉపాధి కూలీలకు సమ్మర్ అలవెన్స్‌లు యథావిధిగా కొనసాగించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు అన్నారు. గురువారం మండలంలోని ఉప్పరగూడెం గ్రామంలో చేపట్టిన ఉపాధి హామీ పథకం పనులను ఆయన పరిశీలించారు. ఉపాధి కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కండెల్లి సోమరాజు మాట్లాడుతూ వేసవి తాపంతో ప్రజలు అల్లాడిపోతున్నారని, సమ్మర్ అలవెన్స్‌లు యథావిధిగా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దండే చినగోతియ్య, నత్తా రాధ, మరపట్ల వెంకట్రావు, కప్పల మేరీ కుమారి తదితరులు పాల్గొన్నారు.

మహిళల రుణమాఫీ సీఎం జగన్ ఘనతే

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ


ఆరుగొలనులో పథకాల ద్వారా అందిన లబ్ధిని వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: డ్వాక్రా మహిళలకిచ్చిన హామీ మేరకు మూడో దఫా ఆసరా పథకం కింద రుణమాఫీ చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. గురువారం సాయంత్రం ఆయన తాడేపల్లిగూడెం మండలం ఆరుగొలను గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వం నుంచి అందిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ గతంలో చంద్రబాబు డ్వాక్రా మహిళలను నమ్మించి మోసగించాడన్నారు. అయితే, జగన్ రుణమాఫీని ఇచ్చిన హామీ మేరకు అమలు చేశారని చెప్పారు. ఈ విషయాలు ఇంటింటికీ వెళ్లిన సందర్భంలో తెలుస్తున్నట్టు తెలిపారు. దాళ్వా సీజన్‌లో వరి పంట దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయన్నారు. అనుకున్న దానికంటే అధికంగా దిగుబడులు వచ్చాయని తెలిపారు. ధాన్యంలో 17 శాతం తేమ ఉంటే రైతులకు మద్దతు ధర లభిస్తుందన్నారు. ధాన్యం బాగా ఎండటం వల్ల ముక్క అవుతుందని రైస్ మిల్లర్లు వెనుకడుగు వేస్తున్నారని చెప్పారు. దీనివల్ల అటు మిల్లర్లు, ఇటు రైతులు నష్టపోకుండా ప్రభుత్వం నేడో.. రేపో ఒక నిర్ణయం తీసుకుంటుందని వెల్లడించారు. టీడీపీ హయాంలో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. సింహాచలం చందనోత్సవాన్ని సైతం రాజకీయం చేయాలని ప్రతిపక్షనేత చంద్రబాబు చూశారన్నారు. చందనోత్సవానికి దేవదాయ శాఖ 10 వేల టిక్కెట్లు జారీ చేస్తే 25 వేల మంది వచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా దర్శనంలో ఆలస్యం, మంచినీరు, మజ్జిగ అందడంలో ఆలస్యమైందే తప్ప ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని చెప్పారు. పచ్చమీడియా దాన్ని రాద్ధాంతం చేసిందని వాపోయారు. దాదాపు 2.25 లక్షల మంది సింహాచలం అప్పన్నస్వామిని దర్శించుకున్నారని, పచ్చమీడియా దిగజారుడు రాజకీయాలు చేయడం సిగ్గు చేటని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో సర్పంచ్ పీతల బుచ్చిబాబు, ఉప సర్పంచ్ అడపా అప్పలరాజు, ఎంపీటీసీలు నార్ని శంకరరావు, మార్లపూడి సుబ్బారావు, నార్ని నాగేశ్వరరావు (నాగులు), సొసైటీ చైర్మన్లు వెలిశెట్టి నరేంద్రకుమార్, చిక్కాల సత్యనారాయణ, గుమ్మళ్ళ తాతారావు, సొసైటీ మాజీ చైర్మన్ గోపిరెడ్డి సత్యనారాయణ, ఇన్‌చార్జి ఎంపీడీఓ వీఎస్ వేణుగోపాల్, పంచాయతీ కార్యదర్శి బి.శ్రీనివాసచంద్రరాజు, ఏపీఎం జీవీకేడీఎం లక్ష్మి, ఏపీఓ ఏవీవీఎస్‌వీ ప్రసాద్, హౌసింగ్ ఏఈ వెంకట్రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్.శ్రీనివాస్, ఎలక్ట్రికల్ ఏఈ అల్లు రామకృష్ణ, నాయకులు ముప్పిడి సంపత్‌కుమార్, అడపా వెంకన్నబాబు, ఆరేపల్లి సుబ్బారావు, చిక్కాల ఏడుకొండలు, వట్టూరి నాగులు, బొద్దాని శ్రీనివాస్, ఎంఎల్‌హెచ్ఓ కృప, కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఐసీడీఎస్, ఆశాలు, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి మళ్లీ జగనే కావాలంటున్న ప్రజలు

మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు


తణుకు 15వ వార్డులో మహిళతో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

తణుకు టౌన్: అర్హులందరికీ సంక్షేమ పథకాలను ఇంటివద్దకే అందిస్తోన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ గెలవాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. గురువారం సాయంత్రం ఆయన తణుకు పట్టణంలోని 15వ వార్డు వీరభద్రపురంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల వివరాలతో కూడిన బ్రోచర్లను మంత్రి కారుమూరి లబ్ధిదారులకు అందజేశారు. వార్డు ప్రజలు చెప్పిన రోడ్లు, డ్రెయినేజీ వంటి సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ రాష్ట్రంలో పేదల కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. మన రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశంలోని ఏరాష్ట్రంలోనూ లేవన్నారు. రాష్ట్రంలో పార్టీలు, కుల, మతాలకు అతీతంగా అర్హతున్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను ఇంట వద్దకే అందిస్తున్నారని చెప్పారు. అర్హతను బట్టి ఒకే ఇంటికి మూడు, నాలుగు పథకాలు అందుతున్నాయని తెలిపారు. నాడు – నేడు పథకంలో పాఠశాలలను అభివృద్ధి చేసి పిల్లల భవిష్యత్‌కు పెద్దపీట వేస్తున్నారని చెప్పారు. ఫ్యామిలీ డాక్టర్ పథకం ద్వారా ప్రజల ఇంటి వద్దకే వైద్య సదుపాయాలను అందిస్తున్నారని తెలిపారు. జిల్లాకో వైద్య కళాశాల ఏర్పాటు చేసి వైద్య విద్యను పేద విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొస్తున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి రాష్ట్రంలోని ప్రతి కుటుంబంలో అన్నగా, తమ్ముడుగా, మేనమామగా అందరికీ అన్ని పథకాలు అందిస్తున్నారని వివరించారు.

వారంలో ఆక్రమణలు తొలగించాలి

తణుకు మున్సిపాలిటీ పరిధిలోని మున్సిపాలిటీకి చెందిన స్థలాల్లో పేరుకుపోయిన ఆక్రమణలను వారం రోజుల్లో తొలగించాలని మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. 15వ వార్డులో ఆక్రమణలకు గురైన మున్సిపల్ స్థలాన్ని వార్డు నాయకులు గనసాల సింగ్ మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో స్థలాన్ని పరిశీలించిన మంత్రి మున్సిపల్ అధికారులను తొలగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కేటీ సుదాకర్, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, మాజీ ఏఎంసీ చైర్మన్ చిట్టూరి సుబ్బారావు, పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, మహిళా అధ్యక్షురాలు నూకల కనకదుర్గ, ములగాల శ్రీనివాసు, వార్డు నాయకులు గనసాల సింగ్, తానేటి వీరయ్య, సుధాకర్ లతో పాటు మున్సిపల్ సిబ్బంది, వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల్లో శశి విద్యార్థుల ప్రతిభ


ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న వైస్ చైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ


ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందిస్తున్న ఇంపల్స్ కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు

తణుకు టౌన్: ఇంటర్ మీడియట్ పరీక్షా ఫలితాల్లో తణుకు శశి జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారని శశి విద్యా సంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాల కృష్ణ అన్నారు. తణుకు శశి జూనియర్ కళాశాలకు చెందిన జూనియర్ ఎంపీసీలో పెరుమాళ్ల స్వాతి శ్రీ 470 మార్కులకు 465 మార్కులు సాధించినట్టు చెప్పారు. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు 55 మంది 460 మార్కులకుపైగా సాధించినట్టు తెలిపారు. జూనియర్ బైపీసీలో మల్లిపూడి హర్ష కుమార్ 440 మార్కులకు 435 మార్కులు సాధించగా, బైపీసీలో 400పైగా మార్కులను 12 మందిఎ సాధించినట్టు చెప్పారు. సీనియర్ ఇంటర్‌లో ఎంపీసీలో 1000 మార్కులకు అరవపల్లి యోగిత 990 మార్కులు సాధించినట్టు తెలిపారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ విద్యార్థులు 980 మార్కులకుపైగా 37 మంది ఉత్తీర్ణత సాధించినట్టు చెప్పారు. బైపీసీలో 1000 మార్కులకు సత్తి ప్రియా లావణ్య 987 మార్కులు సాధించినట్టు తెలిపారు. సీనియర్ బైపీసీలో 960 పైగా మార్కులతో 37 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్టు చెపఆపరు. విద్యార్థులను, అధ్యాపకులను శశి విద్యా సంస్థల వైస్ చైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మేకా క్రాంతి సుద, ప్రిన్సిపాల్ రాఘవేంద్రరావు, వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి, తణుకు కాంపస్ ఇన్‌చార్జి నిమ్మగడ్డ రాజేంద్ర ప్రసాద్‌లు అభినందించారు.

ఇంపల్స్ విద్యార్థుల హవా

ఇంటర్ ఫలితాలలో తణుకు ఇంపల్స్ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్టు కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్ కేఎస్‌వీ రామ్‌కుమార్ తెలిపారు. ఎంపీసీలో ఎం.విమలా స్వామి, ఎం.స్టీఫెన్ పాల్ 470 మార్కులుకు 462, ఎస్.సూర్య 460 మార్కులు సాధించినట్టు చెప్పారు. సీఈసీలో ఎ.బాల భారతి పీ అర్హం జైన్‌లు 500 మార్కులకు 471 మార్కులు సాధించి తణుకు పట్టణ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచినట్టు తెలిపారు. తమ కళాశాల మొత్తం విద్యార్థులలో 90శాతం పైగా ఉత్తీర్ణత సాధించినట్టు చెప్పారు. విద్యార్థులను డైరెక్టర్లు డి.కేశవరావు, ఎం.రాజేంద్రప్రసాద్, సూరిబాబు, రవితేజ, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

కార్పొరేట్ కళాశాల విద్యార్థులకు దీటుగా..

ఇంటర్ పరీక్షల్లో తణుకు శ్రీ చిట్టూరి ఇంద్రయ్య జూనియర్ కళాశాల విద్యార్థులు కార్పొరేట్ కళాశాల విద్యార్థులకు దీటుగా ఉత్తమ ఫలితాలు సాధించి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచినట్టు ప్రిన్సిపాల్ ఎం.కృష్ణసాయి తెలిపారు. తమ కళాశాల విద్యార్థి శశిప్రసాద్ ఇంటర్ సెకండ్ ఇయర్ ఎంపీసీలో 1000కి 972 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలవడంతో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థుల్లో జిల్లాలో ప్రథముడిగా నిలిచినట్టు చెప్పారు. విద్యార్థిని ఎం.భాగ్యవతి 925 మార్కులు సాధించినట్టు చెప్పారు. బైపీసీలో ఎంవీ సాయిశ్రీ 902 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచిందన్నారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

తాడేపల్లిగూడెం శశి విద్యార్థుల హవా

తాడేపల్లిగూడెం: ఇంటర్మీడియట్ ఫలితాల్లో శశి జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో ఎం.మేధా, కె.జాల్విని, కె.సరోజని, టి.టీనా అంజుష, ఎస్‌కె.సారా కౌసర్, కె.లక్ష్మీసౌమ్య, సీహెచ్ బేబీరేష్మ, ఎం.మౌలా మొహిద్దీన్ , పి.అభిషేక్‌లు 464 మార్కులు పొంది పట్టణ ప్రథములుగా నిలిచారని చెప్పారు. 460కి పైగా మార్కులు 29 మంది విద్యార్థులు పొందారన్నారు. జూనియర్ ఇంటర్ బైపీసీ విభాగంలో 431 మార్కులు ఎస్.మేఘన, సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో 987 మార్కులు ఎం.చందు, వై.ప్రియాంక, సీనియర్ ఇంటర్ బైపీసీలో 980 మార్కులను ఎస్.శిరీష, బి.తనుశ్రీసాయి సాధించారని వివరించారు. విద్యార్థులను, ఉపాధ్యాయులను చైర్మన్ గోపాలకృష్ణ, వైస్‌చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ, అకడమిక్ డైరెక్టర్ క్రాంతిసుధలు అభినందించారు.


విద్యార్థులను అభినందిస్తున్న శశి వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ

టాపర్స్‌గా శ్రీ వాసవి విద్యార్థులు


జి.జ్యోత్స్న 920 మార్కులు


కేఎస్‌ఏపీ ప్రసాద రెడ్డి (915)


జి.ప్రసన్నలక్ష్మి 427 మార్కులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని శ్రీ వాసవి జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ చాటారు. ఇంటర్ రెండో సంవత్సరం ఎంఈసీలో, ఇంటర్ మొదటి సంవత్సరం బైపీసీలో నూటికి నూరుశాతం ఫలితాలు వచ్చాయి. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షల్లో జి.ప్రసన్నలక్ష్మి 427, పి.కీర్తి దివ్య జ్యోతి 419, జి.వాసవి ఫణి 412, ఐ.నాగ శ్రీహారిక 408, పి.సత్యశ్రీ 401 మార్కులు సాధించారు. రెండో సంవత్సరం పరీక్షలలో జి.జ్యోత్స్న 920, కేఎస్‌ఏపీ ప్రసాద రెడ్డి 915, ఎం.స్వర్ణలత 906 మార్కులు సాధించి టాపర్స్‌గా నిలిచారు. కళాశాల చైర్మన్ ఎన్‌వీ రమణారావు, సెక్రటరీ మండ బ్రహ్మాజీ, కోశాధికారి ఆలపాటి బోస్, కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రామకృష్ణలు విద్యార్థులను అభినందించారు.

సెంట్ ఆన్స్ ప్రభజనం


ఎస్ఎస్ఎస్ సౌమ్య (శ్రీవల్లి)


వీఎస్‌జీ శ్రావ్య


ఆర్ పుష్పలత


వీఎస్ఎస్ఆర్ నందిని


వి.దివ్య అనంత లక్ష్మి


జి.శ్రీ దుర్గా శిరీషా

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఇంటర్ ఫలితాల్లో సెంట్ ఆన్స్ ప్రభజనం సృష్టించింది. ద్వితీయ సంవత్సరంలో 100 మార్కులకు ఎస్ఎస్ఎస్ సౌమ్య (శ్రీ వల్లి) 989 మార్కులు సాధించి తాడేపల్లిగూడెం పట్టణంలో మొదటి స్థానంలో నిలిచింది. వీఎస్‌జీ శ్రావ్య 986, ఆర్.పుష్పలత 985, ఆర్.శుభ శ్రీ 983 సాధించారు. ప్రథమ సంవత్సరంలో వీఎస్ఎస్ఆర్ నందిని 470 మార్కులకు 462, వి.దివ్య ఆనంత లక్ష్మి 461, జి.శ్రీ దుర్గా శిరీషా 459 సాధించారు. ప్రిన్సిపాల్ అద్దంకి విజయకుమార్ మాట్లాడుతూ అత్యుత్తమ బోధన చేయడం వల్ల తమ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో మంచి మార్కులు సాధించారని కొనియాడారు. విద్యార్థులను అభినందించారు.

బైక్ చోరీపై ఫిర్యాదు

పాలకోడేరు: గరగపర్రు గ్రామానికి చెందిన డి.శ్రీను తన ఇంటి వద్ద నిలుపుదల చేసిన స్ప్లెండర్ వాహనం ఈ నెల 24న అపహరణకు గురైందని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పాలకోడేరు ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు. ఇదిలా ఉండగా వారం రోజుల క్రితం పెన్నాడలోని వైన్ షాపు వద్ద నిలిపి ఉంచిన బైక్ చోరీకి గురయ్యిందని ధర్మారావు అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆదరించండి


పెంటపాడులో ప్రచారం చేస్తున్న పార్టీ నాయకులు

పెంటపాడు: జగనన్న సంక్షేమ ప్రభుత్వాన్ని ప్రజలంతా ఆదరించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి నల్లమిల్లి విజయానందరెడ్డి పేర్కొన్నారు. గురువారం సాయంత్రం పెంటపాడు గ్రామంలో కునాకరపేట కార్యకర్తల ఆధ్వర్యంలో వార్డు సభ్యులు మారంపూడి ఏసుదాసు ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. పలు వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి వారికి అందిన పథకాల లబ్ధిని వివరించారు. ప్రజల స్పందనను అడిగి తెలుసుకున్నారు. రాబోయే రోజుల్లో జగనన్న మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని విజయానందరెడ్డి అన్నారు. ప్రజల పాదయాత్రలో జగనన్న ఇచ్చిన హామీలతో పాటు, ప్రజలు ఊహించని పథకాలు అందించి ప్రతి కుటుంబంలోనూ వెలుగులు నింపారని చెప్పారు. ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణను మరో మారు ఆదరించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో పార్టీ కార్యదర్శి చదలవాడ శ్రీనివాస్, ఉండ్రాజవరపు గోపి, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, బర్ల జయరాంబాబు, కిషోర్, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

భారత్ బలమైన ప్రజాస్వామ్య దేశం



కార్యక్రమంలో మాట్లాడుతున్న విద్యావేత్త తమ్మయ్య

తణుకు టౌన్: ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం మనదేనని, కానీ నైతిక విలువలు ఎక్కువగా పాటించే దేశమని విద్యావేత్త, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ గుబ్బల తమ్మయ్య అన్నారు. గురువారం సాయంత్రం తణుకు రోటరీ క్లబ్‌లో నిర్వహించిన ప్రస్తుత రాజకీయ చదరంగం అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భారతదేశంలో 1950లో రాజ్యాంగం అమలులోకి వచ్చిందని, నాటి నుంచీ గణతంత్ర దేశంగా మారిందని తెలిపారు. తర్వాత దేశంలో ఎమర్జెన్సీ వచ్చిందని, దానికి వ్యతిరేకంగా జయప్రకాష్‌నారాయణ్ ప్రతిఘటన ఉద్యమంతో ప్రభుత్వం మారిందన్నారు. బాబ్రీ మసీదు విధ్వంసం తర్వాత అవినీతికి వ్యతిరేకంగా అన్నా హజారే ఉద్యమం చేశారని గుర్తుచేశారు. దేశంలో పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా ప్రజలంతా అవినీతికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు బసవ రామకృష్ణ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో కార్యదర్శి జి.సుధాకర్, పుట్టా సత్యనారాయణ, రామచంద్రరావు, వి.హనుమంతరావు, సత్యనారాయణ తదతరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతపై అవగాహన


కృష్ణాపురం సదస్సులో పాల్గొన్న జెడ్పీటీసీ సభ్యుడు ఆంజనేయులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కృష్ణాపురం గ్రామంలో మహిళా సాధికారతపై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. శశి ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు ముత్యాల ఆంజనేయులు పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు అన్ని పదవుల్లోనూ అమలవుతున్నాయన్నారు. మహిళలకు ఈ ప్రభుత్వంలో అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు చెప్పారు. శశి ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మేడేను వాడవాడలా నిర్వహించాలి


తణుకు సమావేశంలో మాట్లాడుతున్న కోనాల భీమారావు

తణుకు: కార్మికుల పర్వదినం మేడేను వాడవాడలా అరుణపతాకాలు ఆవిష్కరించి ఘనంగా నిర్వహించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు, స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆఫ్ శ్రీ సత్యనారాయణ స్పిన్నింగ్ మిల్స్ ఉపాధ్యక్షుడు కోనాల భీమారావు కోరారు. తణుకు కలిదిండి భీమరాజు భవనంలో గురువారం శ్రీ సత్యనారాయణ స్పిన్నింగ్ మిల్స్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ సాధారణ సమావేశం నిర్వహించారు. సమావేశానికి భీమారావు అధ్యక్షత వహించి మాట్లాడారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 8 గంటల పని దినానికి తిలోదకాలిస్తూ 12 గంటల పని అమలు చేయడానికి కేంద్రం ప్రభుత్వం పూనుకోవడాన్ని వ్యతిరేకిస్తూ కార్మికులు మేడే ఉద్యమ పోరాట స్ఫూర్తితో ఉద్యమించి 8 గంటల పని దినాన్ని కాపాడుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు రద్దుకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి దాకే ముసలయ్య, ఉపాధ్యక్షులు అట్రు వెంకట్రావు, గరగ శ్రీనివాస్, కరుటూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సూర్యనారాయణ స్వామికి ప్రత్యేక పూజలు


సూర్యనారాయణస్వామి దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): వాసవి కన్యకా పరమేశ్వరి పంచాయతన క్షేత్రంలో గురువారం ఉదయం 7 గంటలకు విఘ్నేశ్వర పూజ, అనంతరం సూర్యనారాయణస్వామికి పంచామృతాలు, ఫలరసాలతో, సుగంధ ద్రవ్యాలతో విశేషంగా అభిషేకాలు, అలంకరణలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం కోశాధికారి నున్న బాల త్రిపుర సుందరరావు, పూర్వ అధ్యక్షుడు పేరూరి కాశయ్య మాట్లాడుతూ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. భక్తులు పూజల్లో పాల్గొన్నారు.

డీ1 సబ్ ఇంజినీర్‌కు అదనపు బాధ్యతలు

తణుకు: తణుకు రూరల్ పరిధిలో గత ఆర్నెల్లుగా ఏఈ స్థానంగా ఖాళీగా ఉండగా డీ1 సబ్ స్టేషన్ పరిధిలో పని చేస్తోన్న సబ్ ఇంజినీర్ పి.సురేష్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ గురువారం ఆ శాఖ ఎస్ఈ సాల్మన్‌రాజు ఉత్తర్వులు జారీచేశారు. అయితే రూరల్ పరిధిలో పని చేస్తోన్న సబ్‌ఇంజినీర్‌కు బాధ్యతలు అప్పగించకుండా పక్క సబ్‌స్టేషన్ నుంచి మరో సబ్ ఇంజినీర్‌కు బాధ్యతలు అప్పగించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల రూరల్ సెక్షన్ పరిధిలో కింది స్థాయి సిబ్బంది ఒకరిపై మరొకరు ఆరోపణలు వ్యవహారం పోలీసు స్టేషన్ వరకు వెళ్లింది. ఈ పరిస్థితుల నేపథ్యంలోనే పక్క సబ్‌స్టేషన్‌కు చెందిన అధికారికి అదనపు బాధ్యతలు అప్పగించారని తెలుస్తోంది.

మునిసిపల్ కమిషనర్ బదిలీ

తాడేపల్లిగూడెం: స్థానిక మునిసిపల్ కమిషనర్ బి.బాలస్వామి రాజమహేంద్రవరం ఉడా వైస్ చైర్మన్‌గా ఆయన బదిలీ అయినట్లు తెలుస్తోంది. అధికారిక ఉత్తర్వులు రావాల్సి ఉంది. కమిషనర్‌గా ఆయన ఇక్కడ ఐదేళ్లు పనిచేశారు.